# అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

పలు డివిజన్లలో కమ్యూనిటీహాళ్లు, మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



హఫీజ్‌పేట్ డివిజన్‌లోని పలు కాలనీల్లో కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన చేసిన విప్ గాంధీ, కార్పొరేటర్ వి. పూజిత, జగదీశ్వర్ గౌడ్

మాదాపూర్, అక్టోబర్ 8: కమ్యూనిటీహాళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, సమావేశాలు, సభలు, జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే, విప్ అరెకపూడి గాంధీ అన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ, జనప్రియ నగర్ ఫేజ్ 1, జనప్రియ నగర్ ఫేజ్ 5 కాలనీల్లో రూ.62 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టబోయే కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్లు వి. పూజిత గౌడ్, వి. జగదీశ్వర్ గౌడ్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిటీహాళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

**● పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..**

హఫీజ్‌పేట్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తు స్థానిక ఎమ్మెల్యే, విప్ అరెకపూడి గాంధీ కార్పొరేటర్లు వి.పూజిత గౌడ్, వి. జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి పలు అభివృద్ధికి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో హుడా కాలనీలో రూ.25 లక్షల వ్యయంతో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయగా జనప్రియనగర్ ఫేజ్ 1లో రూ.25 లక్షల వ్యయంతో కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తుకు శంకుస్థాపన, జనప్రియనగర్ ఫేజ్ 5లో రూ.12 లక్షల వ్యయంతో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ అనుబంధ సంఘాలు, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నేతలు హాజరయ్యారు.

**● మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట ..**

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీ ప్రజల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, విప్ అరెకపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్‌లో 2 వేల గజాలలో రూ.1 కోటి (ఎంపీ నిధులు రూ. 50 లక్షలు, ఎమ్మెల్యే సీడీపీ, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 లక్షల వ్యయంతో) నూతనంగా నిర్మించనున్న మైనార్టీ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే, విప్ అరెకపూడి గాంధీ విచ్చేసి గౌరవ కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్, హమీద్ పటేల్‌తో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీ ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని అన్నారు. మైనార్టీ సమాజం కొరకు అందరికి అందుబాటులో ఉండే విధంగా సకల హంగులతో, అన్ని సౌకర్యాలతో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను 2 వేల గజాలలో నిర్మించడం జరుగుతుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా మైనార్టీ ప్రజలకు మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్‌ను నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేయాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకూడదని, త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.



ఖానామెట్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌కు శంకుస్థాపన చేసిన విప్ గాంధీ, కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, హమీద్ పటేల్

**● పార్కుల అభివృద్ధి..**

పార్కును అన్ని విధాల అభివృద్ధి చేసి, అన్ని హంగులతో సుందరీకరించి ఆహ్లాదకర వాతావరణాన్ని తీసుకురావాలని స్థానిక ఎమ్మెల్యే, విప్ అరెకపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలో రూ.8 లక్షల వ్యయంలో ఎమ్మెల్యే సీడీపీ ఫండ్స్, ఎస్‌డీ ఫండ్స్ నిధులతో నూతనంగా చేపట్టనున్న పార్క్ సుందరీకరణ, అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్‌తో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కును అన్ని హంగులతో ఆధునీకరించి ఆహ్లాదకర వాతావరణంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, బీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ సంఘాలు, ప్రతినిధులు ఉన్నారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, అక్టోబర్ 8 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న గుజరాత్ ఉత్సవ్ మేళ ఆదివారం ముగిసింది. ముగింపు వేడుకల్లో భాగంగా ఆంఫీ థియేటర్‌లో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో ప్రముఖ కూచిపూడి నృత్య గురువులు డాక్టర్ వినీలరావు శిష్య బృందం నర్తన గణపతిమ్, ధన్య కైలాష్, హంస, నందిని తిల్లాన, భారతగమనా, శివాష్టకం, కొలువైతివా, శంకర శ్రీగిరి, నారాయణీయం, భో శంభో, జయము జయము, ఆనంద తాండవం అంశాలను పొలిని, ప్రవళిక, శ్రీనిధి, అలేఖ్య, ధరణి, వైష్ణవి, సంయుక్తలు కూచిపూడి నృత్యరూపకంలో నర్తించిన తీరు సందర్శకులను ఆద్యాంతం ఆకట్టుకుంది.

## శీలా గార్డెన్‌లో మౌలిక వసతుల కల్పన..



శీలా గార్డెన్ వాసులతో సమావేశమైన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, అక్టోబర్ 8 : డివిజన్ పరిధిలోని కాలనీలలో పూర్తిస్థాయి వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. శీలా గార్డెన్‌లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించి తగు మౌలిక వసతులను పెంపొందిస్తామన్నారు. కాలనీలో చేపట్టవలసిన పనులపై శీలా గార్డెన్ వాసులు కార్పొరేటర్ శ్రీకాంత్‌ను ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విప్ గాంధీ తోడ్పాటుతో అధిక నిధులను మంజూరు చేయించుకుంటూ అన్ని కాలనీలలో రహదారులు, తాగునీరు, డ్రైనేజీలు, వరద కాలువలు, కమ్యూనిటీహాళ్లు వంటి పూర్తిస్థాయి వసతులను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ఫణీంద్ర, చేతన్, శ్రీనివాస్, సాయి కిరణ్, గోపాల్, రోహిత్, హరికృష్ణ, పవన్, సాయి, హర్ష, సచిన్, వెంకట్, మణిందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం..



ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో మెడికవర్ దవాఖాన తోడ్పాటుతో మియాపూర్ డివిజన్ ప్రగతిఎన్‌క్లేవ్ పరిధిలోని నీలిమ హైట్స్ గ్రీన్స్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దంత, కంటి, రక్తపోటు, బరువు, ఎత్తు, ఈసీజీ వైద్య పరీక్షలను నిర్వహించారు. కాలనీ ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని ఈ సందర్భంగా వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఆదిత్య, రామ్స్, వింధ్య, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, శ్రీనివాస్, రమేశ్, సాంబశివరావు, సీతారామ్, రాజేంద్రప్రసాద్, రాహుల్, విష్ణుప్రసాద్, అజయ్‌కుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

– మియాపూర్, అక్టోబర్ 8

## నిరుపేద విద్యార్థులకు ఆర్థిక చేయూత

శేరిలింగంపల్లి, అక్టోబర్ 8: చిన్నారుల విద్యకోసం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ విశేష సేవలు అందిస్తుందని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నలగండ్ల ప్రాంతానికి చెందిన వాచ్‌మెన్ వెంకట్‌రెడ్డి పిల్లలు 3వ తరగతి చదువుతున్న బిందు, 4వ తరగతి చదువుతున్న కిశోర్‌ల చదువులకు చేయూతను అందించేందుకు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ నూకల సందీప్, సభ్యులు మధుసుదన్ రెడ్డి, మల్లేశ్ యాదవ్, మారం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సొంతింటి కల సాకారానికి ప్రభుత్వం కృషి

చందానగర్‌లో భూమి పూజా కార్యక్రమంలో విప్ అరెకపూడి గాంధీ



చందానగర్‌లో జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న విప్ గాంధీ, కార్పొరేటర్ మంజులరెడ్డి, జర్నలిస్టులు

కొండాపూర్, అక్టోబర్ 8: జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ తోడ్పాటునిచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చందానగర్‌లోని సర్వే నం: 174లో 1 ఎకరం స్థలాన్ని కేటాయించగా, ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్నాని మారుతీ సాగర్, జర్నలిస్టు నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం సదరు స్థలంలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా విప్ గాంధీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ముందుండి నడిచిన శేరిలింగంపల్లి జర్నలిస్టులు ఎంతో కాలంగా ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని, తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే ఇండ్ల స్థలాల కోసం ఉన్నత అధికారులు, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పలుమార్లు కలవడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించి, అధికారులను ఆదేశించడంతో చందానగర్‌లో ఎకరం స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. అతి త్వరలోనే జర్నలిస్టుల సొంతింటి కలను నిజం చేసేలా సదరు స్థలంలో ఇండ్ల నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పైళ్ల విఠల్‌రెడ్డి, ఉప్పరి శేఖర్ సాగర్, రమేశ్ సాగర్, జగన్‌రెడ్డి, శ్రీనివాస్, మాధవరెడ్డి, వినయ్‌కుమార్, సలీం పాషా, నాగమల్లేశ్వర్‌రావు, శేరిలింగంపల్లి జర్నలిస్టులు పాల్గొన్నారు.

## చిన్నారుల ప్లే పార్కు ప్రారంభం..



హైదర్‌నగర్ డివిజన్ నాగార్జున హోమ్స్‌లో రూ.12 లక్షల సీడీపీ నిధులతో నిర్మించిన చిన్నారుల ప్లే పార్కును విప్ అరెకపూడి గాంధీ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో లక్షలాది నిధులను వెచ్చించి అద్భుతమైన థీమ్ పార్కులను నిర్మించామని, కాలనీలలో చిన్నారులకు ఉపయోగపడేలా పార్కులను ఆటపరికరాలతో తీర్చిదిద్దామన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు, సీఎం కేసీఆర్ మంత్రి కేటీఆర్‌ల తోడ్పాటుతో అధిక నిధులను సమకూర్చుకుని పనులను చేపడుతున్నామన్నారు. చిన్నారులు తమ ఆవాసాల నడుమే క్షేమంగా ఆడుకునేందుకు ప్లే పార్కులు ఎంతో దోహదపడతాయని వవిప్ అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

– మియాపూర్, అక్టోబర్ 8

## పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై కారు బీభత్సం

బండ్లగూడ, అక్టోబర్ 8 : అతివేగం, నిర్లక్ష్యంతో వచ్చిన ఓ కారు పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై బీభత్సం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిల్లర్ నంబర్ 139 వద్ద మెహిదీపట్నం నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో పాటు ముందుగా వెళ్తున్న కారును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఇదిలా ఉంటే కారును నడిపిన వారు మైనర్లుగా పోలీసులు గుర్తించినట్లు తెలిపారు.